క్లుప్తంగా

కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు



కల్లు సీసాలు పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గంభీరావుపేట, లింగన్నపేట, ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లోని కల్లు దుకాణాలపై మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. అమ్మకాలకు సిద్ధంగా ఉన్న కల్లుసీసాలు పరిశీలించారు. విక్రయాల రికార్డులు తనిఖీ చేశారు. శాంపిళ్లు సేకరించి వరంగల్ ల్యాబ్‌కు పంపించారు. ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కల్తీకల్లు విక్రయాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది మల్లేశ్, కిశోర్ కుమార్ ఉన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్ సంక్షేమం



మాట్లాడుతున్న చొప్పదండి ప్రకాశ్

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ సర్కారు చేపడుతున్న సంక్షేమపాలనపై గడపగడపకు ప్రచారం చేయాలని ఆ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో 39వార్డుల అధ్యక్షులతో సమీక్ష నిర్వహించారు. సర్కారు పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్లలోని అన్నివార్డుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓట్లేశారని అన్నారు. 15వ వార్డులో అత్యధికంగా ఓట్లు వచ్చాయన్నారు. ఆ వార్డు కౌన్సిలర్, ఇన్‌చార్జి ఆకునూరి విజయ నిర్మల, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజును అభినందించారు. ముఖ్య నాయకులు గడ్డం నర్సయ్య, దేవరాజు పాల్గొన్నారు.

కౌన్సిలర్ దినేశ్‌కు మాతృవియోగం



నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ కళ దంపతులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని రెండోవార్డు కౌన్సిలర్ రాపెల్లి దినేశ్‌కు మాతృవియోగం కలిగింది. మంగళవారం ఆయన తల్లి రాపెల్లి రాధమ్మ మృతిచెందారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందంకళ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి శాంతినగర్‌లోని దినేశ్ ఇంటికి పరామర్శించారు. రాధమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ అడ్డగట్ల మాధవి, నాయకులు అడ్డగట్ల మురళి, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మ్యాన రవి పాల్గొన్నారు.

సైన్స్ ఫెస్టివల్‌కు సంపత్‌కుమార్

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల దమ్మన్నపేటకు చెందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యాడు. జనవరి 17 నుంచి 20 వరకు హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లోని డీబీటీ క్యాంపస్‌లో జరగనున్న వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు. వర్క్‌షాపులో 'ప్రయోగాత్మక అభ్యాసాన్ని ప్రోత్సహించడంలో కీలకమైన అంశాలు, సైన్స్ బోధనలో వినూత్న సృజనాత్మక పద్ధతుల ఆవిష్కరణలు' అనే అంశాలపై ప్రసంగిస్తారు. ఈసందర్భంగా సంపత్‌కుమార్‌ను జిల్లా విద్యాధికారి రమేశ్, సైన్స్ అధికారి పాముల దేవయ్య, సైన్స్ ఫోరం అధ్యక్షుడు పులి రాజాగౌడ్, దరిపెల్లి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు జీపీ భవనాల ప్రారంభం

గంభీరావుపేట(సిరిసిల్ల): మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కే.తారకరామారావు బుధవారం గంభీరావుపేట మండలంలో పర్యటించనున్నారు. రాజుపేట, జగదాంబతండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించనున్నారు.

ఆర్థికసాయం అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన వంకాయల సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. బాధిత కుటుంబసభ్యులను మంగళవారం తంగళ్లపల్లి ఎంపీటీసీ కోడి అంతయ్య పరామర్శించారు. రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. బీఆర్‌ఎస్ నాయకులు కర్నె బాలయ్య, మోతి మహేశ్, తాటిపాముల శ్రీనివాస్, బాలసాని పరశురాములు, రేగుల దేవయ్య పాల్గొన్నారు.

టెంకాయల టెండర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం హనుమాన్ ఆలయంలో ఏడాదిపాటు టెంకాయలు, పూజ, దీక్షా సామగ్రి విక్రయించేందుకు రూ.12,52,221లకు వస్తాద్ రాజేశ్ టెండర్ దక్కించుకున్నట్లు ఆలయ ఈవో మారుతి వెల్లడించారు.



ముస్తాబాద్‌లో అయ్యప్పస్వామి శోభాయాత్ర



కోలాటం ఆడుతున్న మహిళలు



ఎల్లారెడ్డిపేటలోని ఆలయంలో ప్రత్యేకపూజలు

శరణు.. శరణు

ముస్తాబాద్(సిరిసిల్ల): శరణమయ్యప్ప నామస్మరణతో ముస్తాబాద్ పురవీధులు మార్మోగాయి. జ్యోతి స్వరూపుడి మహా మండల పడిపూజ మహోత్సవాల్లో భాగంగా తిరువాభరణం వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. అభిషేకం అనంతరం స్వామివారి శోభాయాత్ర కోలాటాలు, కేరళ శింగారి మేళాతో సాగింది. రాజు గురుస్వామి ఆధ్వర్యంలో చీటి జితేందర్‌రావు గురుస్వామి ఉత్సవాలు నిర్వహించారు. సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి గృహంలో ప్రత్యేక పూజలు చేశారు.

అల్మాస్‌పూర్‌లో..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌లో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. హరిహర పుత్రుడి ఉత్సవవిగ్రహాలను పల్లకీపై గ్రామంలో ఊరేగించారు. రాత్రి మండల మహాపడిపూజ మహోత్సవాన్ని గురు స్వాములు రాజు, శ్రీనివాస్ నిర్వహించారు. టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ రాధారపు పుష్పల మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.


విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



గంభీరావుపేట: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గంభీరావుపేట మండల సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు అన్నారు. నర్మాల గ్రామంలో వదులుగా విద్యుత్ తీగలను సరిచేయడానికి మిడిల్ పోల్స్ ఏర్పాటు చేసే పనులను మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ ఎడబో యిన రాజు, సింగిల్‌విండో డైరెక్టర్ రాజేశ్వర్ రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, రాజేందర్, కామిరిశెట్టి లక్ష్మణ్, సురేందర్ రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

పల్లెలకు పచ్చతోరణం

- జిల్లాలో 52 రహదారులు, 2,25,000 చెట్లు
- 93,299 చెట్లకు ట్రీగార్డులు
- జీపీలదే సంరక్షణ బాధ్యత
- ప్రయాణికులకు ఆహ్లాదం



రహదారివెంట ఏపుగా పెరిగిన చెట్లు



ఈ చిత్రంలో కనిపిస్తున్న చెట్లు నారాయణపూర్ ప్రధాన రహదారిపై ఆహ్లాదం పంచుతున్నాయి. నిత్యం ఈ దారిగుండా ప్రయాణించేవారు కాసేపు వాహనాలు ఆపి సేదదీరుతున్నారు. ఒకప్పుడు ఈ దారిగుండా ఒక్క చెట్టు కనిపించేది కాదు. అలాంటిది ఐదేళ్లలో దారిపొడవునా భారీ వృక్షాలు ప్రయాణికులకు పచ్చదనంతో స్వాగతం పలుకుతున్నాయి. నారాయణపూర్ లాగే మండలంలోని 11 రహదారుల్లో పచ్చని తోరణాలు కనువిందు చేస్తున్నాయి.

ఎల్లారెడ్డిపేట: జిల్లాలోని ప్రధాన రహదారుల వెంట హరితహారంలో భాగంగా ఏడు దఫాల్లో నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగి పచ్చని తోరణాలుగా మారాయి. దారివెంట ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతున్నాయి. జిల్లాలోని 13 మండలాల పరిధిలో 52 రహదారులున్నాయి. వీటివెంట ఇప్పటివరకు 2,25,000 మొక్కలను నాటారు. ప్రస్తుతం1,00,569 మొక్కలు పదిఫీట్లకు పైగా పెరిగాయి. అంతకు తక్కువ ఎత్తులో ఉన్న 93,299 మొక్కలకు రక్షణగా ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డిపేట మండలంలోనే 11 రహదారులుండగా, 2లక్షల మొక్కలు నాటారు. పదివేలకు పైగా మొక్కలు పదిఫీట్ల వరకు పెరిగాయి. రహదారుల వెంట మొక్కలను రక్షించి పట్టణాలకు దీటుగా మహావృక్షాలుగా తయారు చేయాలనే సంకల్పంతో అధికారులు ఉన్నారు.

చల్లదనం..ఆహ్లాదం

హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను అధికారులు, నిర్వాహకులు సంరక్షిస్తున్నారు. పంచాయతీ సిబ్బంది నిత్యం ఉదయం, సాయంత్రం ట్యాంకర్ల ద్వారా నీరు పడుతూ మొక్కల చుట్టూ పెరిగిన గడ్డిని తొలగిస్తూ ఉండడంతో సుమారు ఐదేళ్లలో మొక్కలు పదిఫీట్ల వరకు ఎత్తు పెరిగాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రధాన రహదారుల వెంట వృక్షాలు చల్లదనం, ఆహ్లాదం పంచుతున్నాయి.

జిల్లా రహదారులకు అనుసంధానంగా..

జిల్లాకేంద్రానికి 13 మండలాల నుంచి ప్రధాన రహదారులతో పాటు వివిధ రహదారులు కలుపుకొని మొత్తం 52 దారుల వెంట చెట్లను పెంచుతున్నారు. జిల్లా కేంద్రానికి అనుసంధానంగా ఉన్న రోడ్లను ఎంచుకొని మొక్కలను పెంచడంపై అధికారులు దృష్టిసారించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది రోడ్ల వెంట రోజూ క్షేత్రస్థాయిలో మొక్కలను పరిశీలించడమే కాకుండా ట్రీగార్డులను ఏర్పాటు చేస్తున్నారు. మరో రెండేళ్లలో రహదారుల వెంట రాజధానికి వెళ్లే జాతీయ రోడ్లకు దీటుగా జిల్లా రహదారుల్లో నాటిన మొక్కలు పెంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ప్రతి మండలకేంద్రంలోని రహదారుల వెంట పెరిగిన చెట్లను ఎవరైనా నరికివేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, జరిమానాలు విధిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో చెట్లు నరికిన 11మందికి జరిమానా విధించారు.

ఆహ్లాదం పంచుతున్నాయి



ప్రధాన రహదారుల వెంట నాటిన మొక్కలు వృక్షాలుగా మారి ఆహ్లాదం పంచుతున్నాయి. రాత్రిపూట ప్రధాన రహదారుల వెంట మధ్యలో ఉన్న డివైడర్లపై నాటిన మొక్కలతో వెలుగులు కళ్లకు తగలకుండా ప్రమాదాల నివారణకు దోహదపడుతున్నాయి.

– న్యాలకంటి దేవేందర్, ఎల్లారెడ్డిపేట

పచ్చగా మారాయి



ఐదేళ్లక్రితం రోడ్డు కిరువైపులా ఎలాంటి మొక్కలు, చెట్లు లేక రోడ్లు బోసిపోయి కనిపించేది. మండుటెండలో రోడ్ల వెంట సేదదీరే అవకాశం ఉండేది కాదు. ఐదేళ్లలోనే పరిస్థితి మారింది. ఇప్పుడు గ్రామాల రహదారులు పచ్చగా మారాయి.

– మోతె మధుసూదన్ రెడ్డి, నారాయణపూర్

సమన్వయంతోనే..



జిల్లా కేంద్రానికి అనుసంధానంగా ఉన్న రోడ్లను గుర్తించి మొక్కలు నాటాం. హరితహారంలో ఏడు దఫాలుగా నాటిన మొక్కలు ఐదేళ్లలో వృక్షాలుగా మారాయి. నాటిన మొక్కలను నిత్యం క్షేత్రస్థాయిలో పరిశీలించాం. సమన్వయంతోనే సంరక్షించగలిగాం.

– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

అందుబాటులో ఉండి.. సమస్యలు పరిష్కరిస్తా

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కనగర్తిలో ర్యాలీగా వస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): వేములవాడ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ప్రజలకు నియంత పాలన నుంచి విముక్తి కలిగిందని పేర్కొన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్, కనగర్తి, సుద్దాల గ్రామాల్లో కార్యకర్తల ఆధ్వర్యంలో మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని రూ.670 కోట్లు అప్పులతో ఇచ్చారన్నారు. కర్నాటక తరహాలో అన్ని గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలు పెట్టి దరఖాస్తులు తీసుకుని, ఆరుర కాల సంక్షేమపథకాలు అమలు చేస్తామన్నారు. మూలవాగుపై వంతెనలకు త్వరలోనే టెండర్లు పూర్తి అవుతాయని, పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. ఇది ప్రజల విజయమని, విజయోత్సవ ర్యాలీ కాదని, ప్రజలకు కృతజ్ఞత ర్యాలీ అన్నారు. సిరిసిల్ల మానేరు స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్, గోపాల్, రుక్మిణి, లక్ష్మారెడ్డి, ఎల్లయ్య, దేవరాజు, గంగయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని నిజామాబాద్‌లో మృతి చెందిన తాళ్లపెల్లి సుశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం రాత్రి పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, కిసాన్‌సెల్ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

విప్ 'శ్రీనివాస్'ను కలిసిన పావని

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సామల పావని కలిశారు. మంగళవారం ఆయన నివాసంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్‌తో పాటుగా మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, సామల దేవదాసు పాల్గొన్నారు.

శ్రమజీవుల సంక్షేమమే లక్ష్యం



ఇల్లంతకుంటలో అభివాదం చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: శ్రమజీవుల సంక్షేమమే సీపీఐ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు. జనవరి 3న సిరిసిల్ల కొత్తబస్టాండులో నిర్వహించే బద్దం ఎల్లారెడ్డి వర్ధంతి సభపై కార్మికవాడల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పంతం రవి, అజ్జ వేణు, సోమ నాగరాజు, కిషోర్, నాగరాజు, అశోక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి మండలంలో...

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం రాళ్లపేట గ్రామంలో మంగళవారం సీపీఐ నాయకులు సోమ ఎల్లన్న ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకుడు సోమ నాగరాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాగరాజు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 99 సంవత్సరాలు అయిందని, అనేకమంది కమ్యూనిస్టుల త్యాగాలతో దేశ స్వతంత్ర్యం సిద్ధించి బ్రిటీష్‌వాళ్లు దేశం విడిచి వెళ్లారని గుర్తు చేశారు. సీపీఐ నాయకులు సోమ మల్లయ్య, లక్ష్మీరాజం, గణేశ్, చిన్న ఎల్లయ్య, రవి, బోయిని ఎల్లయ్య, నరేందర్, ఎలవేని సంజీవ్, నరేష్, కనకయ్య, మరసకంటి ఎల్లయ్య, కనకయ్య, పద్ద రాజయ్య, గణది పెద్ద రాజయ్య, చిన్న రాజయ్య, నారాయణ, రవి, శంకర్, బాబు, ఎల్లయ్య, ప్రసాద్, కర్ణాకర్, అంజయ్య ఉన్నారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామంలో సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా నాయకులు మంద సుదర్శన్ ఆధ్వర్యంలో ఎర్రజెండా ఆవిష్కరించారు. నాయకులు మీసం లక్ష్మణ్, భూంపెల్లి భూంరెడ్డి, గుంటి బక్కయ్య, మందాటి గోపాల్ రెడ్డి, దామెర కొమురయ్య, పందుగ యాదయ్య, మల్లేశం, దేవయ్య పాల్గొన్నారు.

సామూహిక దత్తసత్య వ్రతాలు



వరదవెల్లిలో సామూహిక దత్తసత్య వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

బోయినపల్లి(చొప్పదండి): మధ్యమానేరు జలాశయంలో బోయినపల్లి మండలం వరదవెల్లి గుట్టపై స్వయంభూగా వెలసిన గురుదత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం వరదవెల్లి గ్రామ పరిసరాలు భక్తజనాలతో నిండిపోయాయి. పలువురు దంపతులు సామూహిక దత్తసత్య వ్రతాలు ఆచరించారు. దత్తాత్రేయస్వామిని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్ రావు దర్శించుకున్నారు. ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచులు ఒంటెల గోపాల్, ఆరెపల్లి లత, ఎంపీటీసీలు ఈడుగు రాజేశ్వరి, సంబ బుచ్చమ్మ, ఐరెడ్డి గీత, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, నాగుల శ్రీనివాస్, ఆరెపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు ఉన్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈఈ పృథ్వీధర్‌గౌడ్ మంగళవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని అల్మాస్‌పూర్, రాజన్నపేట, చింతకిందితండా గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్లారెడ్డిపేటలో 860 ఎకరాలకు తైబందీ

- గ్రామ పంచాయతీలో రైతుల సమావేశం



ఎల్లారెడ్డిపేటలో సమావేశమైన రైతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట శివారులోని సింగసముద్రం ఆయకట్టు సాగు 2,200 ఎకరాలుండగా, ఈ యాసంగిలో గ్రామపరిధిలోని 860ఎకరాల సాగుకు రైతులు, అధికారులు కలిసి మంగళవారం తైబంధీ నిర్ణయించారు. తైబందీ ప్రకారమే రైతులు పంటలు సాగుచేసుకునే అవకాశం ఉంది. సింగసముద్రం ఆయకట్టు కింద నారాయణపూర్, రాచర్లబొప్పాపూర్, ఎల్లారెడ్డిపేట, కోరుట్లపేట, సర్వాయిపల్లి గ్రామాలు ఉన్నాయి. వీటికి సంబంధించి తైబంధీ ప్రకారం 12వందల ఎకరాల భూములు యాసంగిలో సాగులోకి రానున్నాయి. అందులో భాగంగా ఎల్లారెడ్డిపేట రైతులు సమావేశం ఏర్పాటు చేసుకుని సాగుచేసిన పూర్తిస్థాయిలో పంటలు చేతికి అందే విధంగా ముందుచూపుతో 860 ఎకరాల తైబందీ నిర్ణయించారు. సమష్టిగా తీసుకున్న నిర్ణయం ప్రకారం పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఒప్పందం చేసుకున్నారు. సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, కనెక్టింగ్ కాలువల చైర్మన్ ఒగ్గు బాల్‌రాజు, గోపాల్‌రెడ్డి, రాజయ్య, శరవింద్, శ్రీనివాస్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

'ఎంపీ ఎన్నికల్లో మహిళలే కీలకం'



కరపత్రం ఆవిష్కరిస్తున్న పద్మ తదితరులు

సిరిసిల్లటౌన్: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మహిళల భాగస్వామ్యం కీలకమని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ అన్నారు. మంగళవారం జిల్లా రివ్యూ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 28నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలనపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రజాపాలన కరపత్రం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, మాజీ చైర్‌పర్సన్ సామల పావని, మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి తదితరులు ఉన్నారు.

'ఆరోగ్య మహిళ' పరీక్షలు

సిరిసిల్లటౌన్: జిల్లాలో ప్రతీ మంగళవారం ఆరోగ్యమహిళ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు తెలిపారు. మంగళవారం నాటి శిబిరాల్లో ఓపీడీ 278, బ్రెస్ట్ 275, ఓరల్ కావిటీ 275పరీక్షలు, యూటీఐ 10, ల్యాబ్ 27, థైరాయిడ్ 21, విటమిన్ డీ 19, సీబీపీ 26, సూక్ష్మ పోషకాలు 26 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

రాములోరి అక్షింతల శోభాయాత్ర



రాచర్లతిమ్మాపూర్‌లో అక్షింతల ఊరేగింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్,రాచర్ల తిమ్మాపూర్ గ్రామాల్లో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముల వారి అక్షింతలను శోభయాత్రగా ఊరేగించారు. గ్రామంలోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయం నుంచి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం వరకు శోభయాత్రగా తీసుకెళ్లారు. సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అపెరా సుల్తానా, వేద పండితుడు వేణుగోపాలాచారి, ఉపసర్పంచ్ మహేందర్, మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య, నాయకులు అందె సుభాశ్, అనిల్, సీత్యానాయక్, నారాయణరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం గూడెంలో అయోధ్య రామమందిర అక్షింతలను మంగళవారం ఘనంగా ఊరేగించారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ చిట్నేని సరిత, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీధర్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్‌రావు, అంజన్ రావు, శ్రీనివాస్‌రావు, మల్లేశ్, రవి పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలతో మానసిక వికాసం



విజ్ఞానయాత్రలో నెహ్రూనగర్ పాఠశాల విద్యార్థులు

సిరిసిల్లఎడ్యుకేషన్: పాఠశాలస్థాయిలో విద్యార్థులను విజ్ఞానయాత్రకు తీసుకెళ్లడం ద్వారా మానసిక వికాసం, సృజనాత్మకత పెంపొందుతుందని సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ అన్నారు. క్రిస్మస్ సెలవులను పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు.వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి , భద్రకాళి ఆలయం, రామప్పగుడి, లక్నవరం చెరువు, భద్రాచలంలోని శ్రీరామచంద్రస్వామి ఆలయం, గోదావరినదిలో లాంచ్ ద్వారా పాపికొండల పర్యటన చేసినట్లు భాగ్యరేఖ వెల్లడించారు.

మొక్కులు చెల్లింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ కొండగట్టు ఆంజనేయస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. తన క్లాస్‌మేట్ చొప్పదండి ఎమ్మెల్యేగా మేడిపల్లి సత్యం గెలుపొందడంతో మొక్కులు చెల్లించుకున్నట్లు వివరించారు.

'ప్రజాపాలన' సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఈ నెల 28 నుంచి ఏర్పాటు చేస్తున్న ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో చిరంజీవి సూచించారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్‌లో మంగళవారం గ్రామసభల వివరాలు వెల్లడించారు. ప్రతీరోజు ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు రెండు గ్రామాలు, మధ్యాహ్నం 2గంటల నుంచి 6గంటల వరకు మరోరెండు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని వెల్లడించారు. 28న అక్కపల్లి, రాజన్నపేట, బుగ్గరాజేశ్వరతండా, కిష్టునాయక్‌తండా, 29న అల్మాస్‌పూర్, తిమ్మాపూర్, బాకూర్‌పల్లి తండా, గుంటపల్లి చెరువు తండా, 30న బండలింగంపల్లి, నారాయణపూర్, పదిర, సింగారం, జనవరి 2న దుమాల, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పోతిరెడ్డిపల్లి, 3న బొప్పాపూర్, గొల్లపల్లి, దేవునిగుట్ట తండా, కోరుట్లపేట, 4న గుండారం, ఎల్లారెడ్డిపేట, అగ్రహారం , రాగట్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయన్నారు. సభలకు మండల స్థాయి అధికారులు హాజరవుతారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.